## ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ ఫ్లెక్సీ వార్

### కాంగ్రెస్ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ శివ చరణ్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన ఈశ్వరమ్మ యాదవ్ వర్గం

**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఇటీవల యాదగిరిగుట్ట బోర్డు సభ్యులుగా నియమితులైన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ప్రమాణ స్వీకారం ను పురస్కరించుకొని మనసురాబాద్ డివిజన్ పరిధిలో పోచబోయిన సురేష్ యాదవ్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. ఆ ఫ్లెక్సీలలో జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఫోటో లేకపోవడంతో ఈశ్వరమ్మ యాదవ్ ఫ్లెక్సీలో జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఫోటో లేకుండా ఎలా వేశారని సురేష్ యాదవ్‌ను శివ చరణ్ రెడ్డి బూతులు తిట్టారు. దీంతో సోమవారం మన్సూరాబాద్‌లోని శివ చరణ్ రెడ్డి ఇంటిపై దాడి చేసి అద్దాలను ధ్వంసం చేసిన ఈశ్వరమ్మ యాదవ్ వర్గం. ఇరు వర్గాల మధ్య తోపులాట.. కర్రలు, రాళ్లతో దాడి చేశారు. పోలీసులు రంగం లోకి లాఠీ ఛార్జ్ చేశారు. ఈ సందర్భంగా పలు బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈశ్వరమ్మ యాదవ్ పై శివ చరణ్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాల్సిందేనని వారు డిమాండ్ చేశారు.

## సీఎం సహాయ నిధి నిరుపేదలకు ఎంతో మేలు

### - లోకసాని కొండల్ రెడ్డి

**విశ్వంభర, సరూర్ నగర్ :** ప్రజలకు ఆపద కాలంలో ఆపద్బాంధవునిగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో సహాయ పడుతుందని మహేశ్వరం నియోజకవర్గం బి.ఆర్.ఎస్ పార్టీ మాజీ యూత్ వింగ్ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ డివిజన్ కు చెందిన కృష్ణ భాస్కర్ రూ . 60,000, ప్రశాంత్ కు 23,000, ఎడ్ల రాములమ్మ రూ .17,000 ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్ లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం శాసన సభ్యురాలు పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లాగా వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చెక్కులను మంజూరు అయ్యేలాగా చూసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌని శ్రీనివాస్ గౌడ్ సీనియర్ నాయకులు, రాగం సునీల్ యాదవ్, కిరణ్ కుమార్, తేజ, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవి కొత్తవారికి అవకాశం ఇవ్వాలి

### - తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు కోల రాజ్యలక్ష్మి

**విశ్వంభర, మలక్ పేట్ :** వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవి కొత్తవారికి అవకాశం ఇవ్వాలి అని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు కోల రాజ్యలక్ష్మి అన్నారు. కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ కార్యకర్తలుగా పని చేసిన వాళ్ళు ఎంతో మంది ఉన్నారు అని ఉమ్మడి జిల్లాల్లో హైదరాబాద్ జిల్లాలో చాలామంది సీనియర్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉన్నారు . చైర్మన్ పదవిని ఇచ్చిన వాళ్లకు ఇవ్వకుండా పదవిలో కష్టపడి కార్యకర్తలుగా పని చేసిన వాళ్లకు చైర్మన్ పదవి నియమించాలని కోరారు.

## బీసీల అభ్యున్నతే తెలంగాణ సమగ్రాభివృద్ధికి బలమైన పునాది

### నూతన సీఎస్ సంజయ్ జాజుకు సమగ్ర వినతిపత్రం

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బీసీలు) సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారతకు సంబంధించిన పెండింగ్ సమస్యలను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, ఐఏఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసి బీసీలకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గుజ్జ సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో బీసీల పాత్ర అత్యంత కీలకమని, రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న ఈ వర్గాల అభ్యున్నతి లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ప్రభుత్వం బీసీల సంక్షేమంపై ప్రకటిస్తున్న సానుకూల విధానాలు స్వాగతించదగ్గవేనని, అయితే వాటి అమలులో మరింత వేగం అవసరమని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సౌత్ ఇండియా ఇన్‌చార్జ్ సూర్యనారాయణ, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు పండరి నాథ్, వెంకన్న, అశోక్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైదరాబాద్ విమానాశ్రయానికి అరుదైన గుర్తింపు

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి అరుదైన గుర్తింపు లభించింది. బ్రిటన్‌కు చెందిన అట్రాక్షన్ టికెట్.కామ్ అనే పర్యాటక సంస్థ నిర్వహించిన సర్వేలో ఫ్యామిలీఫ్రెండ్లీ విమానాశ్రయాల జాబితాలో నాలుగో స్థానంలో లభించింది. ఈ వివరాలను జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఓ ప్రకటనలో పేర్కొంది. విమానాశ్రయాలపై ఈ ఏడాది మేలో అట్రాక్షన్‌టికెట్.కామ్ సర్వే నిర్వహించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 140కి పైగా విమానాశ్రయాలను పరిశీలించింది. ఎయిర్‌పోర్ట్ విస్తీర్ణం, పిల్లల ఆట స్థలం, వారి సౌకర్యాలు, ప్రయాణికుల భద్రత, విశ్రాంతి సదుపాయాలు, వైఫై, గూగుల్ రివ్యూ తదితర అంశాల ఆధారంగా రేటింగ్ ఇచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం 20 పాయింట్లకు గాను 18.5 పాయింట్లను సాధించింది. ఈ గుర్తింపు రావడం పట్ల ఎయిర్‌పోర్ట్ సీఈవో కదీర్ కదిరవన్ స్పందించారు. తమ సిబ్బంది నిబద్ధతకు నిదర్శనమన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులివ్వాలి
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల మంజూరు వెంటనే ప్రారంభించాలి
- జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులివ్వాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి రాంచందర్
- సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలి: హెచ్ యూజే అధ్యక్షుడు అరుణ్ కుమార్
- హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద జర్నలిస్టుల నిరసన

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని సీఎం ప్రకటించినప్పటికీ, ఆ ప్రక్రియ ముందుకు సాగటంలేదని అన్నారు. ఇండ్ల జాగల మంజూరుకు సంబంధించి మంత్రివర్గ ఉప సంఘానికి స్పష్టమైన ఆదేశాలివ్వాలని సీఎంను కోరారు. టి డబ్ల్యూ జే ఎఫ్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం హెచ్ యు జే ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు జర్నలిస్టులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, డీఆర్వో నారాయణని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ రాంచందర్ మాట్లాడుతూ... నిబంధనల పేరుతో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. అర్హత ఉంటే నిబంధనలను సడలించైనా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సబ్ కమిటీ పేరుతో కాలయాపన జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్ యూజే అధ్యక్షులు బి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు ఆరోగ్య కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ యూజే కార్యదర్శి బి జగదీశ్వర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇచ్చిన ఆర్టీసీ బస్ పాస్ లకు సంబందించి 1/3 ఫేర్ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని చెప్పారు. టోల్ చార్జీలు, సెస్ పేరుతో జర్నలిస్టులపై అదనపు భారం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇప్పటికే అమలవుతున్న రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని సూచించారు. హైదరాబాద్ లో పని చేస్తున్న జర్నలిస్టులకు మెట్రో రైలులో ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. హెచ్ యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బి రాజ శేఖర్ మాట్లాడుతూ. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని అన్నారు. ఈనెల 15న హైదరాబాద్ లో ఐ అండ్ పీఆర్ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహా ధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. డీజేఎఫ్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడీటేషన్ల జారిలో నిర్లక్ష్యం సరికాదన్నారు. హెచ్ యూజే టీడబ్ల్యూజేఎఫ్ కార్యక్రమాలకు డీజేఎఫ్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె నిరంజన్, జాతీయ కౌన్సిల్ సభ్యులు చిట్యాల మధుకర్, హెచ్ యూజే ఉపాధ్యక్షులు బి దామోదర్, పీ సర్వేశ్వర్ రావు, ఎం రమేష్, జీ వీరేష్, ఎస్ రమేష్, బి కాలేబ్, జీ రేణయ్య, సహాయ కార్యదర్శులు ఎం జీవన్ రెడ్డి, ఎస్ మాధవరెడ్డి, పి లక్ష్మణ్ రావు, కార్యవర్గ సభ్యులు కె లలిత, పీ విజయ, టీ రాజేష్ కుమార్ , బస్వరాజు, రాజశేఖర్, వెంకట్, వినోద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీర్లను బెదిరించి చరిత్రను మార్చలేరు

### మాజీ టీఎన్జీవో అధ్యక్షులు గుండవరం దేవీప్రసాద్

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమానికి మేధస్సును అందించినవారు ఉద్యమకారులు అయితే, శాస్త్రీయ బలాన్ని అందించినవారు తెలంగాణ ఇంజినీర్లు అని వారిని బెదిరించి చరిత్రను మార్చలేరు అని బిఆర్ఎస్ నాయకులు,టీఎన్జీవో అధ్యక్షులు గుండవరం దేవీప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సమైక్య ఆంధ్రప్రదేశ్ పాలనలో తెలంగాణకు జరిగిన నీటి దోపిడీ, సాగునీటి వివక్ష, ప్రాజెక్టుల విధ్వంసాన్ని దేశం ముందు సాంకేతిక ఆధారాలతో నిరూపించిన ఘనత తెలంగాణ ఇంజినీర్లది. అలాంటి రిటైర్డ్ ఇంజినీర్లను తెలంగాణ ఇంజనీర్స్ డే రోజున శుభాకాంక్షలు చెప్పాల్సిన సంగతిని మరచిపోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కేవలం వారిని అవమానించడం కాదు తెలంగాణ ఉద్యమాన్నే అవమానించడం అని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రేయింబవళ్లు శ్రమించిన ఇంజినీర్లు నేడు కన్నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితిని సృష్టించడం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి నిదర్శనం. తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీరు అందించాలనే లక్ష్యంతో తమ జీవితాలను అంకితం చేసిన నిపుణులను నేడు నిందితుల్లా చిత్రీకరించడం అత్యంత దుర్మార్గమైన చర్య. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత తెలంగాణ అవసరాలకు సరిపోదని, నీటి లభ్యత మెరుగ్గా ఉన్న మేడిగడ్డ వద్ద ప్రాజెక్టును నిర్మించాలని సెంట్రల్ వాటర్ కమిషన్‌తో పాటు తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్లు ప్రభుత్వానికి స్పష్టంగా సూచించారు. ఆ సాంకేతిక నివేదికలు, అధ్యయనాల ఆధారంగానే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. ఇవి ఏ ఒక్క వ్యక్తి ఇష్టానుసారం తీసుకున్న నిర్ణయాలు కావు. ఇప్పుడు అదే ఇంజినీర్లను బెదిరిస్తూ, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై రాజకీయ కక్షసాధింపునకు అనుగుణంగా నివేదికలు ఇవ్వాలని పరోక్షంగా హెచ్చరించడం అత్యంత ప్రమాదకర ధోరణి. ప్రభుత్వానికి నచ్చిన నివేదిక ఇస్తే దేశభక్తులు...నిజాలు చెబితే నేరస్థులా? ఇదేనా కాంగ్రెస్ చెప్పే ప్రజాస్వామ్యం? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. లేకపోతే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని విశ్వసించే ప్రతి వర్గం ఈ అహంకార ధోరణికి ప్రజాస్వామ్యబద్ధంగా గట్టి సమాధానం చెబుతుంది. తెలంగాణ కోసం జీవితాలను అంకితం చేసిన ఇంజినీర్ల గౌరవాన్ని కాపాడటం ప్రతి తెలంగాణ పౌరుడి బాధ్యత.

## బండి కేంద్రమంత్రిగా ఉండటం తెలంగాణ ప్రజల దురదృష్టం

### కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి జగ్గారెడ్డి సూచన

**విశ్వంభర, సంగారెడ్డి :** కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో డ్యామ్ సేఫ్టీ అధికారులతో ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుల సమావేశం ఏర్పాటు చేస్తే కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలు బయటపడతాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కేంద్ర మంత్రిగా ఉండి పాలనపై పూర్తి అవగాహన లేకుండానే విమర్శలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించినట్లుగా కేంద్ర డ్యామ్ సేఫ్టీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని, రాజకీయ వ్యాఖ్యలు కాకుండా వాస్తవాలను ప్రజల ముందుంచాలని అన్నారు. పదేళ్లుగా రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ కలిసి పాలన సాగించాయని, ఆ సమయంలో ఇరు పార్టీలకు రాజకీయ సంబంధాలు ఉన్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు. కేంద్ర జలవనరుల శాఖ బీజేపీ ఆధీనంలోనే ఉన్నందున కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తే అన్ని విషయాలు స్పష్టమవుతాయని అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మాదిరిగానే బండి సంజయ్ కూడా వాస్తవాలను పక్కనపెట్టి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హరీష్ కు పట్టిన రోగమే బండికి పట్టిందని విమర్శలు చేశారు. కేంద్ర మంత్రి హోదాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై స్పందిస్తూ, ఆ అంశంపై పీసీసీకి అందజేయాల్సిన నివేదికను వాయిదా వేసినట్లు జగ్గారెడ్డి తెలిపారు.తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన అంశాలపై రెండు రోజుల పాటు వివిధ వర్గాల అభిప్రాయాలు సేకరించామని చెప్పారు. ఇన్‌చార్జి మంత్రి లక్ష్మణ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అభిప్రాయాలు కూడా తీసుకోవాల్సి ఉన్నందున నివేదిక సమర్పణకు మరికొంత సమయం అవసరమైందన్నారు. ఈ నెల 18 లేదా 20వ తేదీలోపు పీసీసీకి పూర్తి నివేదిక అందజేస్తామని తెలిపారు. తుంగతుర్తిలో కాంగ్రెస్ నాయకులందరూ సమన్వయంతో పనిచేసేలా నిర్ణయం తీసుకుంటామని, రానున్న ఎన్నికల్లో కూడా అక్కడ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## ఐఎన్టీయుసీ కృషితోనే జీఓ -88 విడుదల

- కార్మికుల శ్రేయస్సుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి రుజువైంది
- సిఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలి
- ఐ.ఎన్.టీ.యు.సి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ల రాజి రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐ.ఎన్. టీ.యు.సి గత రెండు నెలలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో ప్రభుత్వం జిఓ ఎంఎస్ నెం.88ను విడుదల చేయడం స్వాగతించదగ్గ పరిణామమని ఐ.ఎన్.టీ.యు.సి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ల రాజి రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు, ఉద్యోగుల వ్యవస్థపై సమగ్ర ఆడిట్ నిర్వహించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఓ 88 తమ నిరంతర పోరాటానికి ఫలితమని ఆయన పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పలుమార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించామని, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, పారదర్శకత, సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మికుల సంక్షేమం, శ్రేయస్సుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జిఓ 88 విడుదల ద్వారా మరోసారి రుజువైందని ఆయన తెలిపారు. జిఓ 88 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల పనితీరు, ఉద్యోగులకు ఈపిఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనాల అమలు, డిబిటి ద్వారా వేతనాల చెల్లింపు, నకిలీ ఏజెన్సీల గుర్తింపు, ఉద్యోగుల పూర్తి డేటాబేస్ రూపకల్పన వంటి అంశాలను ప్రభుత్వం పరిశీలించనుండడం హర్షణీయమన్నారు. ఈ నిర్ణయం వల్ల కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల హక్కులకు మరింత భరోసా లభిస్తుందన్నారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు, ఉద్యోగుల వ్యవస్థపై ఇటీవల ముఖ్యమంత్రి సమీక్షించి ప్రకటించిన మేరకు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల జీతాలు ప్రతి నెల 1వ తేదీన చెల్లించేందుకు, కనీస వేతన చట్టం ప్రకారం కార్మికులందరికీ కనీస వేతనాలు చెల్లించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వానికి సహకరిస్తూనే ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐ.ఎన్.టీ.యు.సి ఉద్యమాన్ని కొనసాగిస్తుందని మొగుళ్ల రాజి రెడ్డి తెలిపారు. అలాగే కమిటీ నివేదిక ఆధారంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## సెలక్టైన నర్సులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

### ఉద్యోగాల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఆర్. కృష్ణయ్య

విశ్వంభర, నాచారం : సెలక్టైన నర్సులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి.. వైద్యశాఖలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి" అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాదు నాచారం ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట నర్సుల పునర్నియామకం, వైద్యశాఖలో ఖాళీ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీల కారణంగా వైద్య సేవలు దెబ్బతింటున్నాయని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే వెంటనే నియామకాలు చేపట్టాలని కోరారు. ధర్నాలో నిరుద్యోగ యువత, వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను వినిపించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 15న సీపీఎం మహాధర్నాను జయప్రదం చేయాలి

### - డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

**విశ్వంభర, చైతన్యపురి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకై నోటిఫికేషన్స్ వేయాలని, ఉద్యోగాల సాధనకై ఈ నెల 15 వ తేదిన సిపిఎం చేపట్టిన మహాధర్నాకు నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం దిల్సుఖ్ నగర్ లో పలు కోచింగ్ సెంటర్లలో మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ 2014లో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తవుతున్నా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతను మోసం చేస్తుందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఆ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు.ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించనున్న ఏడు వేల ఎస్ఐ, కానిస్టేబుల్ పోలీస్ ఉద్యోగాలు సరిపోవని, ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేసి, దానికి అనుగుణంగా పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 16 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేయగా, గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లతో కలిపి మొత్తం 60వేల ఉద్యోగాలే భర్తీ అయ్యాయని అన్నారు.లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ, హాస్టళ్లలో ఉంటూ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలను ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సరూర్నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, డివైఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి మల్లేపాక వీరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
"విశ్వంభర"
తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్ర